# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 22, నవంబరు, 2014

హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడతామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కార్యదర్శుల ఉప సంఘాన్ని కూడా ఇందుకోసం ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిమితులు, సుప్రింకోర్టు నిబంధనలకు లోబడి హుస్సేన్‌సాగర్ చుట్టూ మొదటి దశలో 40 ప్రదేశాలలోని సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఆకాశ హర్మ్యాలు (స్కై స్క్రాపర్స్) నిర్మించాలని నిర్ణయించారు. ఆయా ప్రదేశాలను గుర్తించడం కూడా జరిగింది.

సచివాలయంలో శనివారం ఆకాశహర్మ్యాల నిర్మాణం, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనపై దాదాపు 5 గంటల పాటు సమీక్ష జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, అధికారులు నర్సింగ్‌రావు, ఎస్‌కె.జోషి, రేమాండ్ పీటర్, నాగిరెడ్డి, ప్రదీప్‌చంద్ర, సోమేష్‌కుమార్, స్మితాసబర్వాల్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నదని ప్రకటించారు. సాగర్‌లోకి నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే మురుగు నీరు వల్ల జల కాలుష్యం జరుగుతున్నదన్నారు. దీనిని నివారించడానికి నాలాల ద్వారా వచ్చే నీరు సాగర్‌లోకి చేరకుండా మళ్లింపు కాలవలు నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించిన ముఖ్యమంత్రి త్వరలోనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఇందుకోసం రూ. 100 కోట్లు నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. వినాయక విగ్రహాలు, అమ్మవారి విగ్రహాల నిమజ్జనం వల్ల హుస్సేన్‌సాగర్ కలుషితం అవుతున్నదని ముఖ్యమంత్రి అన్నారు. అటు ప్రజల మనోభావాలను గౌరవిస్తూ మరో వైపు హుస్సేన్‌సాగర్‌కు పూర్వ వైభవం తెచ్చే విధంగా ఇందిరా పార్క్‌లో వినాయక్‌సాగర్ పేరుతో చెరువు నిర్మించి అక్కడే నిమజ్జన కార్యక్రమాలు

చేపట్టాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో త్వరలోనే సమావేశం నిర్వహించాలని కూడా ముఖ్యమంత్రి నిర్ణయించారు. హుస్సేన్‌సాగర్ నీటిలోనే గణేష్ నిమజ్జనం జరిపే సాంప్రదాయం ఉన్నందున వినాయకసాగర్‌ను కూడా హుస్సేన్‌సాగర్ నీటితోనే నింపాలని ముఖ్యమంత్రి సూచించారు. వినాయకసాగర్‌ను కూడా ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయాలని సూచించారు. ఈ ఎండాకాలంలోనే హుస్సేన్‌సాగర్ నీటినంతా ఖాళీ చేసి అడుగు భాగంలో ఉన్న మలినాలను తొలగించాలని నిర్ణయించారు. ఈ పనులన్నింటిని పర్యవేక్షించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ నేతృత్వంలో ప్రదీప్‌చంద్ర, ఎస్‌కె.జోషి, రేమాండ్ పీటర్, నాగిరెడ్డిలతో కూడిన ప్రభుత్వ కార్యదర్శులతో కూడిన ఉప సంఘానికి బాధ్యతలు అప్పగించారు.

సంజీవయ్య పార్కు ప్రాంతంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన టవర్ నిర్మించాలని సమావేశంలో నిర్ణయించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ బుద్ధ భవన్, రాణిగంజ్ బస్‌డిపో, లోయర్ ట్యాంక్‌బండ్, కుందన్‌బాగ్, పాటిగడ్డ, సేయిలింగ్ క్లబ్, యూత్ హాస్టల్, రాఘవ సదన్, నర్సింగ్ కాలనీ, దిల్‌కుషా గెస్ట్‌హౌస్, గ్రీన్‌ల్యాండ్స్, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్, ఎలక్ట్రిసిటి భవన్, టెక్స్ట్‌బుక్ ప్రింటింగ్ ప్రెస్, రిడ్జ్ హోటల్, బూర్గుల రామకృష్ణారావు బిల్డింగ్, ఎక్స్‌పోటెల్, స్నో వరల్డ్ తదితర 40 ప్రాంతాల్లో మొదటి దశలో టవర్స్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ స్థలాలకు సంబంధించిన మ్యాప్‌లను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇవన్నీ కూడా ఏలాంటి వివాదాలు లేకుండా ఉన్నాయని, పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. హుస్సేన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టాల పరిధి అవుతల ప్రాంతంలోనే ఈ టవర్స్ నిర్మిస్తామని వెల్లడించారు. పర్యావరణానికి ఏలాంటి ఆటంకం కలుగకుండా, సుప్రింకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులలోని మార్గదర్శకాలకు లోబడి టవర్స్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. సంజీవయ్య పార్క్ ప్రాంతంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన టవర్ నిర్మించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. టవర్స్ వల్ల వచ్చే

మురికి నీరు కూడా హుస్సేన్‌సాగర్‌లోకి రాకుండా నేరుగా నాలాలోకే వెళ్లే విధంగా భూగర్భ డ్రైనేజ్ ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పెద్ద ఎత్తున టవర్స్ నిర్మిస్తున్నందున అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన విషయంలో కూడా మొదటి నుండే సమగ్ర ప్రణాళికతో ముందుకు పోవాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. టవర్ల నిర్మాణానికి చాలా సంస్థలు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని, దీనికి సంబంధించి విధి విధానాలు ఖరారు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. అటు హుస్సేన్‌సాగర్‌కు పూర్వ వైభవం తేవడం, ఇటు హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి టవర్ల నిర్మాణం, రెండు సందర్భాలలో కూడా పర్యావరణానికి ఏలాంటి ముప్పు రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం